పీవోపీ పరిశ్రమను తరలించాలి

ఎదులాపురం, జూన్ 10 : జనవాస ప్రాంతంలో ఉన్న పీవోపీ పరిశ్రమను దూరప్రాంతాలకు తరలించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం ఇచ్చారు. పిట్టలవాడకు అనుకొని ఉన్న పీవోపీ పరిశ్రమతో కాలనీ వాసులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీవోపీ తయారు చేసే క్రమంలో అందులో ఉన్న రసాయనాల పొగ, వాసన భరిచలేకపోతున్నామన్నారు. ఇది వరకు ఎన్నో సార్లు అధికారులు విన్నవిచ్చిన పట్టించుకోలేదన్నారు. కాలనీవాసులు నారాయణ, రమేశ్, శంకర్, అశోక్, బాబు, మాధవ్, దేవ, తదితరులు ఉన్నారు. ఈ విషయంలో మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కట్టెతో దాడిలో నలుగురిపై కేసు

ఎదులాపురం, జూన్ 10 : పందులు పట్టేందుకు వెళ్లిన వ్యక్తిపై కట్టెతో దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ అశోక్ తెలిపారు. వడ్డెరకాలనీకి చెందిన మక్కల లక్ష్మణ్, దండ్ల నగేశ్ కలిసి ఈ నెల 8వ తేదీన సంజయ్ నగర్‌కు పందులు పట్టడానికి వెళ్లారు. ఈ క్రమంలో డీ నగేశ్ తన తల్లిదండ్రులు ఎల్లయ్య భూమక్క ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి చేరుకొని ఎక్కడికి ఎందుకు వస్తావని లక్ష్మణ్‌ను ఎల్లయ్య అంటాడు. అలాగే మిగితా వారు లక్ష్మణ్‌ను దుర్భాషలాడుతారు. ఈ క్రమంలోనే మాటమాట పెరిగి మక్కల లక్ష్మణ్‌పై ఎల్లయ్య కట్టెతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మక్కల లక్ష్మణ్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు

నేరడిగొండ, జూన్ 10 : మండలంలోని జాతీయ రహదారిపై దూదిగండి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కేవీఆర్ కంపెనీలో పనిచేస్తున్న ట్యాంకర్ డ్రైవర్ జాదవ్ రాజు(32) అక్కడికక్కడే మృతి చెందాడు. జాతీయ రహదారి డివైడర్‌లోని చెట్లకు ట్యాంకర్ ద్వారా నీళ్లు పోస్తున్నారు. నిర్మల్ వైపు నుంచి వస్తున్న లారీ ట్యాంకర్‌ను బలంగా ఢీకొంది. దీంతో రాజు డ్రైవింగ్ చేస్తుండడంతో ట్యాంకర్ బోల్తా పడడంతో మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు, బంధువులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారిపై సుమారు మూడు గంటల పాటు రస్తారోకో చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ రోడ్డు పై బైటాయించారు. కేవీఆర్ కంపెనీ యాజమాన్యం బాధిత కుటుంబానికి పరి హారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులకు ఉట్నూర్ డీఎస్పీ నాగేంద్ర, ఇచ్చోడ సీఐ భూమేష్ నచ్చజెప్పే ప్రయత్నం చేయగా శాంతించి రాస్తారోకోను విరమించారు. మృతుడు మండలంలోని శంకరాపూర్ గ్రామానికి చెందిన వాడు. కాగా భార్య పంచపూల, కూతురు ఉన్నారు. రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు భారీగా నిలిచి పోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడ్డారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు

కలెక్టర్ రాజర్షి షా

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 10 : పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకలను పురస్కరించుకుని కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమం,గోవధ నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పశువుల అక్రమ రవాణా నిరోధం జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ సూచనలు చేయడం జరిగిందన్నారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించి చట్టాలు పక్కగా అమలయ్యేలా చూడాలని, సంబంధిత శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలన్నారు. గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవధను నిషేదించినందున ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ ,ఎక్కడ కూడా గోవధ జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలో చెక్‌పోస్టులను వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ చేయాలన్నారు. నిబంధలు విరుద్ధంగా వివిధ వాహనాలలో పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజ్ చేసిన పశువులకు స్థానికంగానే షెల్టర్‌కల్పిస్తు ,వాటికి పశుగ్రాసం ,నీటి సవతి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో గోశాల నిర్వహకుల సహకారం తీసుకోవాలన్నారు. పశువుల వారాంతపు సంతలలో నిబంధనలు అనుగుణంగా ,పశు సంరక్షణ చట్టానికిలోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఎక్కడబడితే అక్కడ పశువులను వధించకుండ కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, ఆర్డీవో జివాకార్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్, తహసీల్దార్లు, పంచాయితీ అధికారులు తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

ఎదులాపురం, జూన్ 10 : ప్రభుత్వ కార్యాలయాలు, సమావేశ మందిరాల్లో ఎక్కడ కూడా ప్లాస్టిక్ బాటిల్స్ వాడరాదని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినట్లు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. ప్రతి కార్యాలయంలో ఆజ్ఞలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్‌వోడీలను ఆదేశించారు. అధికారిక కార్యక్రమాలు, సమావేశాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాజ్ఞలను అమలు చేయాలన్నారు. మండలాలు, గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేయాలని అదేశించారు. సమావేశంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో

ఎదులాపురం, జూన్ 10 : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి ఉంటుందని, ఉద్యోగులు బాధ్యతగా అంకితభావంతో పని చేయాలని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు సూచించారు. ఇటీవల ఎన్నికైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంపీహెచ్ఏ(మేల్) ఏజెన్సీ కార్యవర్గాన్ని ఉట్నూర్‌లో ఎన్నుకున్నారు. సోమవారం డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్‌ను ఆయన ఛాంబర్‌లో ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. డీఎంహెచ్‌వో సానుకూలంగా స్పందిస్తూ తన పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలు పరిష్కరించి కాని వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌వో ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఐవో డాక్టర్ వైసీ శ్రీనివాస్, డీఎంవో ఎం శ్రీధర్, వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి కృష్ణ, అల్లాడి రఘురాం, ఉపాధ్యక్షుడు రాథోడ్ రవీందర్, ఆరోగ్య కార్యకర్తల సంఘం(మేల్) అధ్యక్షుడు రాథోడ్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి రాథోడ్ కైలాస్, కార్యదర్శి రాథోడ్ భగవాన్‌దాస్, ఉపాధ్యక్షుడు రాథోడ్ సుభాష్, కోశాధికారి జాదవ్ వసంత రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టమైన కళల్లో రాణించాలి

చిన్నారికి ప్రశంసాపత్రం అందజేస్తున్న యోగానంద సరస్వతి

ఎదులాపురం, జూన్ 10 : చిన్నారులు చదువుతో పాటు ఇష్టమైన కళల్లో రాణించేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతీ అన్నారు. ఆదిలాబాద్‌లోని శ్రీరామ చంద్ర గోపాల కృష్ణ మఠంలో మంథనం ఒక సంకల్పం సాహితి సాంస్కృతిక కళావేదిక ప్రాంగణంలో ఆదివారం రాత్రి జరిగిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మే 1 నుంచి జూన్ 9 వ తేదీ వరకు 40 రోజుల పాటు ఉదయం చిత్రలేఖనం, మట్టితో విగ్రహాల తయారిపై ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. చిత్రలేఖనం, మట్టి విగ్రహాల తయారిపై మంథనం ఒక సంకల్పం వ్యవస్థాపకుడు కళాకారుడు నిశీకాంత్ దేశ్ పాండే శిక్షణ ఇచ్చారు. 30 మంది శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారులకు మఠాధిపతి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత వసంత్‌రావు దేశ్ పాండే, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్, కళాకారులు సతీష్, దేశ్‌పాండే, అనిరుద్, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలి

నిర్మల్ చైన్‌గేట్ : వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అధికారులు

వీడియో కాన్ఫరెన్సులో మంత్రి సీతక్క

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 10: భారీ వర్షాలు, వరదల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. వర్షాకాలం సమీపించినందున వరదల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. క్లోరినేషన్ చేపట్టిన తర్వాతనే ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు. పురాతన ఇండ్లలో నివాసం ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వే, ఏకరూప దుస్తుల తయారీ వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీపీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ సందీప్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎదులాపురంలో..

ఎదులాపురం, జూన్ 10 : వర్షాకాలం శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్లు, డీఆర్‌డీఏ, డీపీవో, సీఈవో ఇరిగేషన్ సంబంధిత శాఖల అధికారులతో వర్షాకాలంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, అధిక వర్షాలవల్ల వరదలతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సీఈవో, డీఆర్డీఏ సాయన్న, డీపీవో శ్రీలత, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్వార్‌తో బెదిరించిన ముగ్గురు అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి

ఎదులాపురం, జూన్10 : వైన్స్ షాపువద్ద తల్వార్‌తో బెదిరించిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ అశోక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 6వ తేదీన ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి వద్ద గల శ్రీనివాస్ వైన్స్‌లో తిర్పెల్లికి చెందిన షేక్.నౌషద్, పంజేషాకాలనీకి చెందిన లాలు అలియన్ అతీఫ్ ఉద్దీన్‌ఫరూకి, మహాలక్ష్మీవాడకు చెందిన షేక్.ఇర్ఫాన్, చోట తలాబ్‌కు చెంది అజ్మత్‌ఖురేషిలు తల్వార్‌ను చూపించి మద్యం ఇవ్వాలని లేనియెడల చంపేస్తాం ..షాపును ధ్వంసం చేస్తాం అని బెధిరించారు. వైన్స్‌లో సిబ్బంది డయల్ 100కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకోగా వారు పారిపోయారు. వైన్స్ షాపు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం టూ టౌన్ పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో షేక్.నౌషద్, లాలు, షేక్.ఇర్ఫాన్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. అజ్మత్ ఖురేషి (పరారీ)లో ఉన్నాడని తెలిపారు. వీరిపై గతంలో కూడా పలు దొంగతనం,బెదిరింపు కేసులు నమోదు చేయబడినట్లు పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బెదిరించిన వారిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లను నమోదు చేసి కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు.

సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలి

ఎదులాపురం, జూన్ 10 : వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ ఫలితాల అవకతవలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ డైరెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఈ నెల 4వ తేదీన ప్రకటించిన నీట్ ఫలితాల్లో 67మంది విద్యార్థులు 720కి 720 మార్కులు పొందారని, ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎలా అగ్రస్థానంలో నిలిచారనే దానిపై వివాదం నెలకొందన్నారు. హర్యానాలోని పరీక్షా కేంద్రంలోని తరగతి గదిలో పరీక్ష రాసిన విద్యార్థుల్లో పక్కపక్కనే కూర్చున్న వారిలో 8మంది విద్యార్థులకు 720 కి720 మార్కులు రావడం ప్రశ్నపత్రం లీక్ అయిందా? లేక మాస్ కాపీయింగ్ జరిగిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నీట్ యూజీ పరీక్షలో అవకతవకలకు పాల్పడినట్లు సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, నిపుణులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు మెస్రం హరీశ్, భీంరావ్ పాల్గొన్నారు.

మహిళలపై బీజేపీ నేత లైంగిక వేధింపులు!

› మొదటిపేజీ తరువాయి...

ఆరోపణలకు క్షమాపణ చెప్పడంతోపాటు అన్ని సామాజిక మాధ్యమాల నుంచి మూడు రోజుల్లో ఆ వ్యాఖ్యలను తొలగించాలని లేదా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ ఒక నోటీసు పంపింది. ముందుగా మాలవీయకు కలిగిన మానసిక క్షోభకు, గౌరవ భంగానికిగాను నష్ట పరిహారం కింద రూ.10 కోట్లు డిమాండ్ చేసింది. బీజేపీ నేత రాహుల్ సిన్హాకు బంధువు అయిన శంతను సిన్హా ఇటీవల ఫేస్‌బుక్‌లో మాలవీయకు వ్యతిరేకంగా ఒక పోస్ట్ పెట్టారు. మాలవీయ పలువురు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడ్డాడని, అనేక నీచమైన చర్యలలో భాగస్వామి అని ఆరోపించారు. ఈ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. తక్షణం మాలవీయ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. మాలవీయ చేతిలో లైంగిక దోపిడీకి గురైన మహిళలకు బీజేపీ న్యాయం చేయాలని కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ డిమాండ్ చేశారు. ప్రధానిగా మోదీ ప్రమాణం చేసిన 24 గంటల్లోనే ఓ ప్రముఖ బీజేపీ నేతపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. మాలవీయ చర్యలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని అన్నారు.

వ్యాఖ్యలు ఉపసంహరించుకోను: సిన్హా

ఫేస్‌బుక్‌లో తాను చేసిన వ్యాఖ్యలు ఎవరినీ ఉద్దేశించినవి కావని శంతనుసిన్హా స్పష్టం చేశారు. కొందు బీజేపీ నేతలు తమ అధికార పదవులను కాపాడుకోవడం కోసం తమ ఢిల్లీ బాస్‌లను ప్రసన్నం చేసుకోవడానికి అనేక అక్రమ మార్గాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఫేస్‌బుక్‌లో తన పోస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, సామాజిక మాధ్యమం నుంచి వాటిని తొలగించలేదని, ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తనకు అందిన లీగల్ నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు కొంత సమయం కావాలని కోరానని తెలిపారు.

నీట్ అక్రమాలపై విద్యార్థుల గర్జన

కేంద్ర విద్యా శాఖ ఆఫీస్ వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

- నీట్-2024ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్
- నీట్ పరీక్షను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి
- తమిళనాడు ప్రభుత్వానికి హైకోర్టు రిటైర్డ్ జడ్జి కమిటీ సిఫార్సు

నీట్ అక్రమాలపై హైదరాబాద్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

న్యూఢిల్లీ/చెన్నై, జూన్ 10: దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్షలో అక్రమాలపై దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు సోమవారం ఢిల్లీలోని కేంద్ర విద్యా శాఖ కార్యాలయం సమీపంలో ఆందోళన చేపట్టాయి. పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగినట్టు వస్తున్న ఆరోపణలపై స్వతంత్ర, పారదర్శక విచారణ చేయాలని జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు అవిజిత్ ఘోష్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రవేశ పరీక్ష సమగ్రతను కాపాడేందుకు మరింత విశ్వసనీయమైన, సురక్షితమైన పరీక్షా విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని, నీట్ అంశంపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల విడులైన నీట్-యూపీ పరీక్షా ఫలితాల్లో ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. అయితే పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరుగలేదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) చెబుతున్నది.

కౌన్సెలింగ్‌పై స్టే విధించాలి

నీట్ యూజీ-2024 ప్రవేశపరీక్షను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అదేవిధంగా మే 5న నిర్వహించిన ఈ పరీక్షలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేయాలని, పేపర్ లీక్ ఆరోపణలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు కౌన్సెలింగ్‌పై స్టే విధించాలని పిటిషన్‌దారులు అభ్యర్థించారు. పరీక్ష నిర్వహణ హేతుబద్ధంగా లేదని, విద్యార్థులకు బ్యాక్‌డోర్ ద్వారా ప్రవేశాలు కల్పించేలా అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

ప్లస్ 2 మార్కులే ప్రామాణికంగా ఉండాలి

నీట్ ప్రవేశపరీక్షను తొలగించేందుకు చట్ట, శాసనపరమైన చర్యలు తీసుకోవాలని మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే రాజన్ నేతృత్వంలోని కమిటీ తమిళనాడు ప్రభుత్వానికి సిఫారసు చేసింది. వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు హయ్యర్ సెకండరీ ఎగ్జామినేషన్(ప్లస్ 2) తరగతిలో వచ్చిన మార్కులను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించింది. వివిధ పరీక్ష బోర్డుల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నది. తమిళనాడు విద్యార్థులపై నీట్ ప్రభావంపై అధ్యయనానికి ఈ కమిటీని డీఎంకే ప్రభుత్వం 2021లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేసింది.

నకిలీ ప్రకటనలను నమ్మొద్దు

సిలబస్‌పై సీబీఎస్ఈ హెచ్చరిక

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ సిలబస్, నమూనా ప్రశ్నాపత్రాలు తదితర అంశాల్లో తప్పు దోవ పట్టించే ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీబీఎస్ఈ సోమవారం విద్యార్థులను హెచ్చరించింది. వార్తలను సరి చూసుకోకుండా ప్రచురించే ఆన్‌లైన్ పోర్టళ్లను నమ్మొద్దని సూచించింది. 'మా సిలబస్, నమూనా ప్రశ్నాపత్రాల గురించి కొన్ని పోర్టళ్లు, వెబ్‌సైట్లు కాలం చెల్లిన లింకులను, ధ్రువీకరించుకోని వార్తలను ప్రచురిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. 2024-25 విద్యా సంవత్సరానికి గాను తాజా సమాచారం అందిస్తున్నట్టు అవి తప్పుడు ప్రకటనలు ఇస్తున్నాయి' అని సీబీఎస్ఈ పేర్కొంది. వాటిని నమ్మి గందరగోళానికి గురి కావొద్దని సూచించింది.

మహా రైతుల కన్నెర్ర

- కరువు రాయితీల కోసం నేషనల్ హైవే దిగ్బంధం
- ప్రభుత్వ జాప్యంపై అన్నదాతల ఆగ్రహం

లాతూర్, జూన్ 10: కరువు రాయితీలు, ఇతర ఉపశమన ఆర్థిక ప్రయోజనాలు అందించడంలో జాప్యాన్ని నిరసిస్తూ వందలాది మహారాష్ట్ర రైతులు సోమవారం లాతూర్-అంబేజోగయి హైవేను దిగ్బంధించారు. రెనాపూర్ తహశీల్‌ను ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించినప్పటికీ రైతులకు ఇంకా కరువు రాయితీలు అందలేదని ధర్నాకు నాయకత్వం వహించిన షెత్కరీ సంఘటన నాయకుడు గజన్ బొలంగే తెలిపారు. రహదారి దిగ్బంధం రెండు గంటల పాటు సాగింది. ఈ సందర్భంగా వారు తహశీల్ కార్యాలయ గేటును మూసివేసి నిరసన తెలిపారు. '70 శాతానికి పైగా అర్హులైన రైతులకు కరువు రాయితీలు లేదా ఇతర ఉపశమన ప్రయోజనాలు అందలేదు. దీనిపై తహసీల్దార్ వివరణ ఇవ్వాలి. ఇంకా రైతుల ఖాతాల్లోకి డబ్బులు ఎందుకు వేయలేదో అధికారులు బ్యాంకులను అడగాలి' అని గజన్ అన్నారు. ఒక హెక్టార్‌కు రూ.50 వేల పంట బీమా రాయితీని కూడా రైతులు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ నెల 20లోగా కరువు రాయితీలు అందించకుంటే రెనాపూర్ ప్రాంతంలో మరింత పెద్ద ధర్నా నిర్వహిస్తామని రైతు నాయకుడు దత్తాజీ షింగ్డే హెచ్చరించారు.

సత్నామీల నిరసన హింసాత్మకం

ఎస్పీ ఆఫీసు నుంచి వెలువడుతున్న పొగ

బలోడా బజార్: సత్నామీ తెగవారు అత్యంత పవిత్రంగా పరిగణించే జైత్‌ఖామ్బ్ (స్థూపం)ను గుర్తు తెలియని వ్యక్తులు అపవిత్రం చేయడంతో నిరసనలు పెల్లుబికాయి. ఛత్తీస్‌గఢ్ గిరౌడ్‌పురి ధామ్‌లోని అమర్ గుహలో ఉన్న ఈ పవిత్ర చిహ్నాన్ని గత నెల 15-16 మధ్య రాత్రి అపవిత్రం చేశారు. ఈ కేసులో పోలీసులు ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ, కలెక్టర్ కార్యాలయం వద్ద ఘెరావ్ నిర్వహించాలని సత్నామీ తెగవారు పిలుపునిచ్చారు. బలోడా బజార్ పోలీసు సూపరింటెండెంట్ సదానంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, దాదాపు 5,000 మంది నిరసనకారులు తరలివచ్చి, కలెక్టర్ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. రాళ్లు విసురుతూ, కొన్ని వాహనాలను తగులబెట్టారు. ఎస్పీ కార్యాలయానికి నిప్పు పెట్టారు. ఈ కార్యాలయంలో కొంత భాగం దెబ్బతింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

మణిపూర్ సీఎం సెక్యూరిటీ కాన్వాయ్‌పై దాడి

భద్రతా సిబ్బందిలో ఒకరికి గాయాలు



ఉగ్ర దాడిలో గాయపడిన భద్రతా సిబ్బందిని పరామర్శిస్తున్న బీరేన్ సింగ్

ఇంఫాల్ : మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ సెక్యూరిటీ కాన్వాయ్‌పై మిలిటెంట్లు కాల్పులకు తెగబడ్డారు. కాంగ్‌పోక్పి జిల్లాలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. మిలిటెంట్ల దాడిలో కాన్వాయ్‌లోని ఓ వాహనం డ్రైవర్ కుడి భుజానికి బుల్లెట్ గాయమైంది. ఇటీవల హింస చెలరేగిన జిర్‌బామ్ జిల్లాలో సీఎం మంగళవారం పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు భద్రతా ఏర్పాట్లలో భాగంగా కాన్వాయ్ వెళ్తుండగా కొట్లెన్ గ్రామానికి సమీపంలో మిలిటెంట్లు దాడికి దిగారు. కాన్వాయ్‌లోని వాహనాలపై పలుమార్లు కాల్పులు జరిపారని, భద్రతా బలగాలు మిలిటెంట్ల కోసం కూంబింగ్ ఆపరేషన్ చేపట్టినట్టు చెప్పారు.

ఏడాది దాటినా మణిపూర్‌లో శాంతి ఏదీ?

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్



నాగపూర్‌లో ప్రసంగిస్తున్న భాగవత్

నాగపూర్, జూన్ 10: మణిపూర్ హింసపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. హింస చెలరేగి ఏడాది దాటుతున్నా.. ఆ రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులు నెలకొనటం లేదంటూ పాలకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం నాగపూర్‌లో ఆరెస్సెస్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మణిపూర్ హింసను అత్యంత ప్రాధాన్యత గల అంశంగా పరిగణించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మోహన్ భాగవత్ సూచించారు. శాంతి కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నా.. పరిస్థితులు మారటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మాటల చాతుర్యంతో ఎన్నికల్లో గెలుపొందటంపై కాకుండా, దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని పాలకుల తీరును విమర్శించారు.

ఫ్రాన్స్ పార్లమెంటు రద్దు

పారిస్: ఫ్రాన్స్ పార్లమెంటు దిగువ సభ నేషనల్ అసెంబ్లీని ఆ దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్ రద్దు చేశారు. యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో ఆయన పార్టీ నేషనల్ రినయసెన్స్‌కు షాక్ తగలడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జూన్ 30, జూలై 7 తేదీల్లో నేషనల్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో ఫ్రాన్స్ ప్రతిపక్షంలోని అతివాద నేషనల్ ర్యాలీ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించబోతున్నట్లు ఆదివారం వెల్లడైంది. వలసదారులను కట్టడి చేయాలని డిమాండ్ చేస్తున్న ఈ ప్రతిపక్ష పార్టీకి మద్దతు 31-32 శాతం వరకు పెరిగినట్లు సర్వేలు చెప్తున్నాయి. మాక్రన్ పార్టీకి దాదాపు 15 శాతం మద్దతు లభిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈయూ ఎన్నికల్లో మాక్రన్ పోటీ చేయలేదు. ఆయన పదవీ కాలం మరో మూడేళ్లు ఉంది. నేషనల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధిక స్థానాలను గెల్చుకుంటే, సొంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి, బిల్లుల ఆమోదానికి మాక్రన్‌కు అవకాశం లభిస్తుంది.

కెనడాలో భారతీయుడి హత్య

ఒట్టావా : విదేశాల్లో భారతీయులు, భారత సంతతి పౌరులపై దాడులకు అడ్డుకట్ట పడటం లేదు. కెనడాలోని బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్‌లో 28 ఏండ్ల భారత సంతతి పౌరుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో నలుగురు అనుమానితుల్ని పోలీసులు అరెస్ట్‌చేశారు. జూన్ 7న సర్రేలో కాల్పుల ఘటన చోటుచేసుకుందని, గుర్తు తెలియని కొంతమంది యువరాజ్ గోయల్‌పై కాల్పులు జరిపి ఈ హత్యకు పాల్పడ్డారని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ సోమవారం తెలిపింది.

సాయంత్ర వ్యాయామంతో షుగర్ కంట్రోల్!



న్యూఢిల్లీ : సాయంత్ర వేళల్లో వ్యాయామం చేయడం వల్ల బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఒబెసిటీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అధిక బరువు, ఊబకాయంతో బాధపడే పెద్దలు సాయంత్రం పూట మధ్యస్థ స్థాయి నుంచి అధిక స్థాయిలో శారీరక శ్రమ చేయడం వల్ల షుగర్ లెవెల్స్ తగ్గుతాయని అధ్యయనం వెల్లడించింది. స్పెయిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ గ్రెనడా పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. 186 మందిపై అధ్యయనం చేయగా, ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు, మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి వరకు 14 రోజులపాటు 46 ఏండ్ల సగటు వయస్సు, అధిక బరువు ఉన్న వారితో వ్యాయామాలు చేయించినట్టు పేర్కొన్నారు. సాయంత్రం వేళల్లో శారీరక శ్రమ చేసిన వారి బ్లడ్ షుగర్ లెవెల్స్ తక్కువగా ఉన్నట్టు అధ్యయనంలో తేలింది.

మలావీ ఉపాధ్యక్షుడు ప్రయాణిస్తున్న ఫ్లైట్ గల్లంతు

బ్లాంటైర్: మలావీ ఉపాధ్యక్షుడు సాలోస్ చిలిమా ప్రయాణిస్తున్న మిలిటరీ విమానం సోమవారం అదృశ్యమైంది. దేశాధ్యక్షుడు లాజరస్ చక్వేరా కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఈ విమానంలో ఆయనతోపాటు మరో 9 మంది ప్రయాణిస్తున్నారు. రాజధాని నగరం లిలోన్‌గ్వే నుంచి బయల్దేరిన ఈ విమానం మ్జుజు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగవలసి ఉంది. కానీ రాడార్‌తో దీని సంబంధాలు తెగిపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు.